నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 5 అక్టోబర్ 2024 | RANGAREDDY

రేపటి నుంచి మెట్రో పార్కింగ్ ఫీజు

భగ్గుమంటున్న ప్రయాణికులు

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): మెట్రో రైలు ప్రయాణికుల డిమాండ్లను పరిష్కరించకుండా పార్కింగ్ ఫీజులు పెంచుతామంటున్న ఎల్ అండ్ టీ మెట్రో అధికారులపై ప్రయాణికులు భగ్గుమంటున్నారు. గత నెలలోనే నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో కొత్తగా పార్కింగ్ ఫీజులు పెంచుతామని బోర్డులు ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో అధికారులు వెనక్కి తగ్గారు. మళ్లీ తాజాగా మెట్రో ప్రయాణికులకు మూడు ఆఫర్లు అంటూ ప్రకటిస్తూనే...నామమాత్రపు పార్కింగ్ ఫీజును అక్టోబర్ 6 నుంచి వసూలు చేయాలని నిర్ణయించడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మూడు బోగీలతో నడుస్తున్న మెట్రో రైళ్లకు అదనంగా కోచ్‌లను ఏర్పాటు చేయాలని నెలల తరబడిగా డిమాండ్ చేస్తున్నా.. ఆ విషయాన్ని పట్టించుకోకుండా పార్కింగ్ ఫీజులు పెంచుతారా.? అంటూ సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు.

సర్వే చేయలేం!

డిజిటల్ క్రాప్ సర్వే కోసం ఏఈవోల మెడపై కత్తిపెట్టిన ప్రభుత్వం

- సర్వే తమతో కాదంటున్న వ్యవసాయ విస్తరణాధికారులు
- రంగారెడ్డి జిల్లాలో ఉన్న ఏఈవోలు 68 మంది..సర్వే చేయాల్సింది 1,23,398 హెక్టార్లలో..
- ఇప్పటికే 49 రకాల విధులతో సతమతమవుతున్నామని ఆవేదన
- నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు ..

రంగారెడ్డి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : రైతులు పండిస్తున్న పంటల సాగును డిజిటలైజ్ చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే(డీసీఎస్) పట్ల వ్యవసాయ విస్తరణాధికారులు విముఖత చూపుతున్నారు. సిబ్బంది కొరత, పనిఒత్తిడి వంటి కారణాలతో సర్వే చేయలేం! అంటూ చేతులెత్తేశారు. సర్వే చేసేందుకు గల ఇబ్బందులపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా.. సర్వే చేయాల్సిందేనంటూ మెడపై కత్తి పెట్టడం పట్ల ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కే 49 రకాల విధులతో సతమతమవుతున్న తమకు సర్వే తలకుమించిన భారంగా మారిందని వాపోతున్నారు. కొద్దిరోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూనే ఏఈవోలు విధు లు నిర్వర్తిస్తుండగా..డిజిటల్ క్రాప్ సర్వే ప్రశ్నార్థకంగా మారింది.

సిబ్బంది కొరతే ప్రధాన సమస్య..

డిజిటల్ క్రాప్ సర్వే కోసం ప్రభుత్వం ఇప్పటికే ఏఈవోలకు శిక్షణ ఇచ్చి.. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను వారికి అందజేసింది. అయితే ఎంతో పకడ్బందీగా నిర్వహించే ఈ సర్వేను సహాయకులు లేకుండా చేపట్టడం సాధ్యం కాదని ఏఈవో(వ్యవసాయ విస్తరణాధికారులు)లు పేర్కొంటున్నారు. జిల్లాలోని 87 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో 1,23,398 హెక్టార్లలో డిజిటల్ సర్వేను చేపట్టాల్సి ఉన్నది. రైతులకు సంబంధించిన 10,73,416 ఫామ్స్‌ను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి ఉంటుంది. ఒక్కో క్లస్టర్ పరిధిలో 15 నుంచి 20 వేల ఫామ్స్ ఉండగా..25 మీటర్లకు ఒక్కో ఫొటో తీయాలి. ఈ లెక్కన ఆ విస్తీర్ణంలో ఎన్ని రకాల పంటలను సాగు చేస్తే..వేర్వేరుగా ఆ పంటల ఫొటోలను తీయాల్సిందే. దీంతో 8,500 ఎకరాలు ఉన్న క్లస్టర్‌లో లక్షకు పైగా ఫొటోలు తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఉన్న 68 మంది ఏఈవోలతో ఇదేలా సాధ్యమని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఏఈవోలు రుణమాఫీ, రైతుబీమా, పీఎం కిసాన్, పంట నష్టం సర్వే వంటి పనుల్లో బిజీగా ఉన్నారు. త్వరలోనే ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన పనుల్లోనూ తలమునకలు కానున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే పేరిట మరింత భారాన్ని మోపడం భావ్యం కాదని వారు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్రం చేపడుతున్న ఈ సర్వేలో పక్క రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. సహాయకులను నియమిస్తే సర్వేకు సహకరిస్తామని చెబుతున్నా.. తమ మాటలను ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరసనలతో సర్వేకు బ్రేక్..

ఏఈవోల నుంచి నిరసన వ్యక్తం కావడంతో డిజిటల్ క్రాప్ సర్వేకు బ్రేక్ పడింది. ఇప్పటికే డీసీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని పంటల సాగు వివరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేయాల్సిన ఏఈవోలు నల్లబ్యాడ్జీలు ధరించే విధులకు హాజరవుతున్నారు. సహాయకులను నియమిస్తే సర్వే చేపడతామని కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారులకు వేర్వేరుగా వినతిపత్రాలను సైతం అందజేశారు. ఏఈవోలు ఒక్కరే సర్వే చేయడం సాధ్యపడదని వారు మొత్తుకుంటున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సర్వే చేసేందుకు ఏఈవోలు ఎందుకు నిరాకరిస్తున్నారో.. వారి సమస్యలేమిటో తెలుసుకునే ప్రయత్నం ప్రభుత్వం చేయకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతానికి ఏఈవోల నుంచి సహాయ నిరాకరణ ఎదురవడంతో సర్వే ఆగిపోయింది.

ఫార్మాను వ్యతిరేకిస్తూ

మహాపాదయాత్ర

9న చేపట్టనున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్/బొంరాస్‌పేట, అక్టోబర్ 4 : దుద్యాల మండలంలోని లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచెర్లకుంటతండా, రోటిబండతండాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా, రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల 9న మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తేదీ ఉదయం 6 గంటలకు దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి ఈ యాత్ర ప్రారంభమై హకీంపేట, రోటిబండతండా, లగచెర్ల, దుద్యాల, కొడంగల్ మండలంలోని హస్నాబాద్, పర్సాపూర్ గ్రామాల మీదుగా కొడంగల్ మహాలక్ష్మీవేంకటేశ్వరాలయం వరకు కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం కొడంగల్‌లో అభివృద్ధి పేరుతో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేసి పొల్యూషన్‌ను అంటగట్టే చర్యలు తీసుకుంటున్నదని ఆయన మండిపడ్డారు. ఈ యాత్రలో ఫార్మా బాధిత గ్రామాల రైతులు, రైతు సంఘాల నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నరేందర్‌రెడ్డి కోరారు.

అప్రకటిత భారం

అనుమతి లేకుండానే ఆస్తి పన్ను పెంపు

- ఆదాయం పెంచుకునేందుకు అడ్డదార్లు
- స్టాండింగ్ కమిటీ తీర్మానం, ప్రభుత్వ అనుమతి లేకుండానే భారం
- ఆదాయం తగ్గుతున్న నేపథ్యంలో రూ.50 కోట్ల అదనపు రాబడికి అడుగులు
- కౌన్సిల్‌లో నిలదీస్తామంటున్న కార్పొరేటర్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో బల్దియా యంత్రాంగం అడ్డదార్లు తొక్కుతున్నది. నిబంధనలను నీళ్లొదిలి ప్రజలపై పన్ను భారం మోపుతున్నది. బల్దియాకు ప్రధాన ఆదాయవనరు ఆస్తిపన్నును ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండానే సవరణలు చేస్తున్నది. ఇందుకు విద్యుత్‌శాఖ బిల్లులు, సబ్ రిజిస్ట్రార్లను పావుగా వాడుకుంటున్నది. గత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో పోల్చితే పన్ను వసూలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో అడ్డదార్లు తొక్కైనా సరే.. ఆదాయాన్ని పెంచుకునే దిశగా పావులు కదుపుతున్నది. నూతనంగా కొనుగోలు చేస్తున్న ఖాళీ స్థలం నుంచి ఇండ్లు, అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ వరకు రిజిస్ట్రేషన్ చేస్తూనే ఆస్తిపన్ను సైతం అసెస్‌మెంట్ చేస్తున్నారు. రిజిస్ట్రార్ అంతేకాదు స్టాండింగ్ కమిటీ నుంచి ఎటువంటి తీర్మానం, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే ఆస్తిపన్నును పెంచేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే బల్దియా అప్రకటిత ఆస్తిపెంపు నిర్ణయాన్ని అమలు చేస్తున్నదని ప్రజలు మండిపడుతున్నారు. అప్పుల ఊబి నుంచి జీహెచ్ఎంసీని బయటపడేసేందుకు తమపై భారం మోపుతారా అంటూ.. ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

19.49 లక్షల ఆస్తులు

జీహెచ్ఎంసీ పరిధిలో 19.49 లక్షల ప్రాపర్టీలుండగా, వాటిలో రెసిడెన్షియల్ 16.35 లక్షలు, నాన్ రెసిడెన్షియల్ 2.80 లక్షలు, మిక్స్డ్ 34వేల వరకు ఉన్నాయి.వీటి నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు దాదాపు రూ.1224 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేశారు. ఈ ఏడాది రూ.2,400 కోట్లు వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. టార్గెట్ చేరుకునేందుకు ప్రస్తుతం రూ.101 ఆస్తిపన్ను చెల్లిస్తున్న భవనాలకు రేట్లను సవరించి పెంచాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. పెంచిన పన్నునే వసూలు చేస్తున్నారు. దీంతో పాటు ఇప్పటివరకు పన్ను నెట్‌వర్క్ లేని వాటిని గుర్తించేందుకు డ్రోన్ సర్వే చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు చందానగర్, మియాపూర్, ఇతర ప్రాంతాల్లో 14వేల ప్రాపర్టీలను సర్వే చేశారు. వీటితోపాటు బిల్డింగ్ పర్మిషన్, ఆక్యూపెన్సీ, తాజాగా ఆస్తిపన్ను చెల్లించిన రసీదు, వాటర్‌బిల్లు, ట్రేడ్ లైసెన్స్, ఓనర్ వివరాలు సేకరిస్తున్నారు. వాటర్ బిల్లు, కరెంట్ బిల్లు ఆధారంగా రెసిడెన్షియల్ కేటగిరీలో పన్ను చెల్లిస్తున్నారా? కమర్షియల్ కేటగిరీలో చెల్లిస్తున్నారా? అనే అంశాన్ని పరిశీలించి పన్ను పెంచుతున్నారు. ముఖ్యంగా నివాస కేటగిరీలో పన్ను చెల్లిస్తున్న 50వేల నిర్మాణాలకు వాణిజ్య కోటా విద్యుత్ సరఫరా అవుతున్నట్లు తేలింది.

రూ.50కోట్ల మేర ఆదాయం పెరగొచ్చని..

చదరపు అడుగుకు 60 పైసలు, 80 పైసల చొప్పున పన్ను చెల్లించే కట్టడాలకు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సుమోటోగా నోటీసులు జారీని ప్రారంభించారు. నాలుగు కేటగిరీల్లోని రెండు లక్షల నిర్మాణాలను సర్వే చేస్తే..మొత్తంగా రూ. 50కోట్ల మేర ఆదాయం పెరగవచ్చని అధికారుల అంచనా వేశారు. అయితే ఆస్తిపన్ను పెంచాలంటే జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో తీర్మానం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా ఉత్తర్వులు ఇవ్వాల్సిందేనని ఓ అధికారి తెలిపారు. కానీ ఈ రెండు ప్రక్రియలు పూర్తి చేయకుండానే ఆస్తిపన్ను ఎలా పెంచుతారని పలువురు కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ అప్రకటిత ఆస్తిపన్ను నిర్ణయాన్ని వచ్చే కౌన్సిల్‌లో నిలదీస్తామని కార్పొరేటర్లు హెచ్చరిస్తున్నారు.

ప్రజల కోసమే.. పట్లోళ్ల కుటుంబం

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి
- ఘనంగా మాజీ హోంమంత్రి ఇంద్రారెడ్డి జయంతి
- చేవెళ్ల ప్రజల గుండెల్లో ఇంద్రారెడ్డి కుటుంబం చిరస్థాయిగా నిలిచిపోతుందని వ్యాఖ్య

చేవెళ్ల టౌన్ : కౌకుంట్ల గ్రామంలోని స్వర్గీయ ఇంద్రారెడ్డి సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

చేవెళ్లటౌన్/మొయినాబాద్, అక్టోబర్ 4 : ప్రజల కోసమే.. పట్లోళ్ల కుటుంబం అని, చేవెళ్ల ప్రాంత ప్రజల గుండెల్లో ఇంద్రారెడ్డి కుటుంబం చిరస్థాయిగా నిలిచిపోతుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. స్వర్గీయ ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి, కౌకుంట్ల గ్రామంలోని సమాధి వద్ద కుటుంబసభ్యులు కార్తీక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, రంగారెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి సబితారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్లోళ్ల కుటుంబ రాజకీయ ప్రస్థానం ప్రజల కోసమే ఆరంభమైందన్నారు. ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులకంటే ప్రజలే ముఖ్యమంటూ నిరంతరం ప్రజల బాగు కోసమే పరితపించారని కొనియాడారు. పట్లోళ్ల కుటుంబ ఎదుగుదలను చూసి ఓర్వలేని వారు ఇప్పటికీ మమ్మల్ని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తుంటారని.. ఎవరెన్నీ అడ్డంకులు, అవరోధాలు, విమర్శలు చేసినా ప్రజల పక్షమే ఉంటామని స్పష్టం చేశారు. ఇంద్రారెడ్డి ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరకాలం గుర్తుండిపోతారన్నారు. అదేవిధంగా ఇంద్రారెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, జిల్లా నాయకులు కొత్త నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంఏ రావూఫ్, జయవంత్, నర్సింహాగౌడ్, కృష్ణారెడ్డి, సుధాకర్‌యాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి, శ్రీనివాస్, షేక్‌మహబూబ్, రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు బాల్‌రాజ్, విజయలక్ష్మీరమణారెడ్డి, జడ్పీటీసీ మాలతీకృష్ణారెడ్డి, చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ప్రధాన కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాపారావు, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, సర్పంచ్‌లు మాణిక్యారెడ్డి, జహంగీర్, రామచంద్రయ్యగౌడ్, చేవెళ్ల మండల మాజీ యూత్ అధ్యక్షుడు శేఖర్, ఎల్లయ్య, వెంకటేశ్, కృష్ణ, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాధవ గౌడ్, వైభవ్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, బాల్‌రాజ్, రాజశేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు కందుకూరులో బీఆర్ఎస్ ధర్నా

సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో..

పాల్గొననున్న మాజీ మంత్రి కేటీఆర్

కందుకూరు : అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలంటూ.. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి నేతృత్వంలో మండల కేంద్రంలో శనివారం భారీ ధర్నా చేపట్టనున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమల్లో విఫలమవ్వడం.. రుణమాఫీని పూర్తిస్థాయిలోఅర్హులైన రైతులకు వర్తింపజేయకపోవడాన్ని నిరసిస్తూ జరుగనున్న ఈ ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పలువురు పార్టీ నేతలు పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. ధర్నా ఏర్పాట్లపై పార్టీ నాయకులతో ఆమె చర్చించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మెడ లు వంచి.. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీని పూర్తి స్థాయిలో అమలు చేసే వరకు వదిలిపెట్టేది లేదని ఆమె స్పష్టం చేశారు.

రేవంత్‌కు మంచి బుద్ధి ప్రసాదించు బాబా

సీఎం రేవంత్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని, మూసీ పరీవాహక ప్రాంతంలోని తమ ఇండ్ల జోలికి రాకుండా చూడాలంటూ ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చైతన్యపురి శ్రీవెంకటసాయినగర్, ఫణిగిరి కాలనీలవాసులు శుక్రవారం స్థానిక సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించి.. బాబాకు వినతిపత్రం సమర్పించారు. -ఎల్బీనగర్

గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి

బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : నగరాన్ని గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రేటర్‌లో శానిటేషన్ ప్రక్రియను మెరుగుపరిచి గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని శానిటేషన్ అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు. గతంలో శానిటేషన్ మెరుగుకు తీసుకున్న చర్యలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. అవసరమైతే జడ్సీలు, ఎస్ఎస్‌డబ్ల్యూ ఇంజినీర్లతో చర్చించి తుది నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని శానిటేషన్ ఏసీకి సూచించారు. మార్కెట్ల వద్ద వ్యర్థాలను ఒకే చోట వేసేలా డస్ట్‌బిన్లు, కమర్షియల్ స్ట్రేచెస్ వద్ద లిట్టర్ బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. జీహెచ్ఎంసీలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు జోనల్ స్థాయిలో కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా ప్యాకేజీ పరంగా టెండర్లు పిలిస్తే పనులు వేగవంతంగా అయ్యే అవకాశాలపైనా ఆలోచించాలన్నారు. స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్ లింక్ ఇచ్చినందున రూట్ మ్యాప్ తయారు చేసి.. ఆ మ్యాప్ ఆధారంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరిగేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

ఓయూకు ఏమైంది?

పరీక్షలు ఒకటోతేదీ నుంచి...

నోటిఫికేషన్‌పై సంతకమైంది 26న

వెబ్‌సైట్‌లో ఉంచింది మాత్రం 3న...

అధికారుల వైఖరితో దిగజారుతున్న వర్సిటీ ప్రతిష్ఠ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 4 : శతాధిక వసంతాల ఉస్మానియా యూనివర్సిటీ పరువును దిగజార్చేలా అధికారులు ప్రవర్తిస్తున్నారు. నాలుగేండ్లుగా అధికారుల వైఖరిపై ఎన్నోసార్లు వివిధ ఆరోపణలు వచ్చినా.. వారిలో మాత్రం కొద్దిగా కూడా మార్పురాలేదు. తాజాగా, వర్సిటీ అధికారుల మరో లీల వెలుగుచూసింది. అధికారుల నిర్లక్ష్యంతో వర్సిటీ పరువు దిగజారడంతోపాటు స్టూడెంట్స్ విద్యా సంవత్సరం నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించింది. సాధారణంగా ఏదైనా పరీక్షలు నిర్వహించే తేదీని పదిహేను రోజుల ముందే ప్రకటించి, సదరు నోటిఫికేషన్‌ను వెబ్‌సైట్‌లో పెట్టాల్సిన అధికారులు దానిని మరిచారు. దీంతో పరీక్షలు రాయాల్సిన విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమైన సంగతి కూడా తెలియలేదు.

పరీక్షకు ఐదు రోజుల ముందు తేదీలను నిర్ణయిస్తూ అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్

ఎంకామ్ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ (2022-2023 బ్యాచ్ మాత్రమే) పరీక్షలను ఈ నెల 1న నిర్వహించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గత నెల 26న నోటిఫికేషన్ విడుదల చేశారు. పరీక్షలు నిర్వహించబోయే తేదీకి కేవలం అయిదు రోజుల ముందుగా పరీక్షా తేదీలను నిర్ణయించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీ అధికారులకే దక్కింది. పరీక్షలు మొదలైన రెండు రోజుల తర్వాత పరీక్షా తేదీలతో కూడిన నోటిఫికేషన్‌ను వెబ్‌సైట్‌లో ఉంచారు. దీనిపై విద్యార్థులు మండిపడుతున్నారు. తమకు కనీస సమాచారం లేకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు కనీస సమయం ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామూళ్ల మత్తులో ఆబ్కారీ

- యథేచ్ఛగా నగరానికి కల్తీ కల్లు సరఫరా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఆబ్కారీ శాఖ మామూళ్ల మత్తులో జోగుతున్నది. గ్రేటర్‌లో యథేచ్ఛగా కల్తీ కల్లు విక్రయాలు కొనసాగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నరన్న ఆరోపణలున్నాయి. శుక్రవారం కడ్తాల్‌లో కల్తీ కల్లు పట్టుబడింది. విచారణలో నిందితుడు హైదరాబాద్ నగరంలోని కల్లు కంపౌండ్‌లకు కల్తీ కల్లును సరఫరా చేస్తున్నట్లు వెల్లడించడం. ఆబ్కారీ శాఖ నిఘా లోపానికి నిలువెత్తు నిదర్శనం. అంతేకాకుండా కొందరు అధికారుల నిర్లక్ష్యం.. అవినీతి కారణంగా నగరంలోని కల్లు కంపౌండ్‌లకు కల్తీ కల్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం. 2007లో తెలంగాణ వ్యాప్తంగా నగర శివార్లతోపాటు ఇతర జిల్లాల్లో కల్తీ కల్లు సేవించి సుమారు 8,000 మంది అస్వస్థతకు గురవ్వగా, అందులో 12 మంది మృత్యువాత పడ్డారు. అప్పట్లో ఈ ఘటన ఆబ్కారీ శాఖను ఒక కుదుపు కుదిపేసింది. ఆ తర్వాత 2012లో మరోసారి రంగారెడ్డి జిల్లా పరిధిలో కల్తీకల్లుతో పలువురు అస్వస్థతకు గురైన ఉదంతాలు వెలుగుచూశాయి.

విత్‌డ్రాయల్ సింప్టమ్స్..

కల్తీ కల్లు తయారు చేసే ప్రక్రియలో భాగంగా మత్తు, రుచి, వాసన కోసం కొన్ని రకాల రసాయన పదార్థాలను కలుపుతారు. ఇందులో భాగంగా మత్తు కోసం సీహెచ్, డైజోఫామ్, ఆల్ఫాజోమ్, గుల్పారం వంటి నిషేధిత పదార్థాలను వినియోగిస్తారు. ప్రతిరోజూ కల్లు సేవించే వారు ఒక పరిమిత మోతాదు మత్తు పదార్థానికి అలవాటు పడతారు. కల్లులో నిర్వాహకులు రోజు కలిపే మోతాదు కంటే ఎక్కువ డోసులో మత్తు పదార్థాలను కలిపినా లేదా తక్కువ మోతాదులో కలిపినా.. రోజు వారీగా ఆ కల్లు తాగే వారు అస్వస్థతకు గురవ్వడమే కాకుండా వింతగా ప్రవర్తిస్తారు. ఈ రకమైన లక్షణాలనే విత్‌డ్రాయల్ సింప్టమ్స్ అంటారు. ముఖ్యంగా ఎక్కువ మోతాదు మత్తుతో కూడిన కల్లుకు అలవాటు పడిన వారు తక్కువ మోతాదు మత్తు కలిపిన కల్లు తాగినప్పుడు వారు ఈ విత్‌డ్రాయల్ సింప్టమ్స్‌కు గురవుతారని వైద్యులు వివరించారు. ఇకనైనా కల్తీకల్లుపై ఆబ్కారీ శాఖ అధికారులు దృష్టి సారించి.. చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.